క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ గచ్చిబౌలి డివిజన్ ఆత్మీయ సమ్మేళనం

రాయదుర్గం: బీఆర్ఎస్ పార్టీ గచ్చిబౌలి డివిజన్ ఆత్మీయ సమ్మేళన సభను ఆదివారం నిర్వహించనున్నట్లు మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తెలిపారు. రాయదుర్గం లోని ఎంఎస్ కన్వెన్షన్‌లో సాయంత్రం 4 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గచ్చిబౌలి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్‌పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

మియాపూర్ ట్రాఫిక్ సీఐగా బిల్లా కిరణ్ కుమార్


బిల్లా కిరణ్ కుమార్

హఫీజ్‌పేట్ : మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బిల్లా కిరణ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మియాపూర్ ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించిన సుమన్‌కుమార్ బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓగా బదిలీపై వెళ్లారు. జీడిమెట్ల డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న బిల్లా కిరణ్ కుమార్ మియాపూర్ ట్రాఫిక్ సీఐగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటానన్నారు.

రూ.220 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు...

శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ పరిధిలోని శేరిలింగంపల్లి సర్కిల్‌లో అత్యధికంగా ప్రాపర్టీ ట్యాక్స్ వసూలైంది. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో రూ.220.12 కోట్లు వసూలైనట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం చివరి రోజు కావడంతో రాత్రి 12 గంటలకు వరకు ట్యాక్స్ చెల్లించేందుకు అవకాశం కల్పించారు. దీంతో భవన యజమానులు చివరి రోజు రూ. 6.94 కోట్లు చెల్లించినట్లు వారు వివరించారు.

డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాలు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్‌లో శనివారం మూడు రోజుల పాటు నిర్వహించనున్న డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్‌ను పలువురు డిజైనర్లతో కలిసి నిర్వాహకురాలు అనిత అగర్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతను ఆకట్టుకునే విధంగా వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు స్టాల్స్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఫెస్టివ్, వెడ్డింగ్, డిజైనర్, కస్టమైజ్డ్, లైఫ్‌స్టైల్ డెకార్స్, అసెసరీస్, జ్యూలరీ అందుబాటులో ఉన్నాయన్నారు.

అపరిచితుడికి దేహశుద్ధి

జిన్నారం(పటాన్‌చెరు): రాత్రి వేళలో షర్ట్‌లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ ఘటన శనివారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో అర్ధ రాత్రి ఓ వ్యక్తి షర్ట్ లేకుండా తిరుగుతుండటంతో స్థానికులు గమనించారు. మతిస్థిమితం లేనివాడిగా ప్రవర్తిస్తూ ఓ ఇంటి గేటు ముందు సంచరిస్తున్నాడు. తెల్లవారుజాము వరకు స్థానికులు అతడిని గమనిస్తూ ఉండి పట్టుకున్నారు. ఎందుకు వచ్చావని ప్రశ్నిస్తూనే చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పిచ్చివాడిలా ఉన్నాడని, కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. షర్ట్ లేకుండా తిరుగుతున్న వ్యక్తి చెడ్డీ గ్యాంగ్‌కు చెందిన వారు తిరుగుతున్నారేమోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో కాలనీలో పోలీసులు తగిన బందోబస్తును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇఫ్తార్‌కు తరలి రావాలి

పటాన్‌చెరు: రంజాన్ మాసం సందర్భంగా ఈ నెల 12న సాయంత్రం పటాన్‌చెరు జీఎంఆర్ కన్వెన్షన్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతినిధులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ముస్లింలు ఇఫ్తార్‌కు హాజరు కావాలని కోరారు. సీఎం కేసీఆర్ నిరుపేద ముస్లింల కోసం రంజాన్ తోఫాలను అందిస్తున్నారని, త్వరలో వీటిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నిలువ నీడ లేదు

- నానాటికి తీవ్ర మవుతున్న ఎండలు
- షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు
- ఏడాది క్రితం బస్ షెల్టర్ కూల్చివేత
- గంగారం ఆర్ఎస్ బ్రదర్ ఎదుట బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు


బస్ షెల్టర్ లేక రోడ్డుపై ఎండలో నిలుచున్న ప్రయాణికులు

మియాపూర్: ఎండాకాలం వచ్చేసింది... నానాటికి ఎండలు మండిపోతున్నాయి. ఉదయం పది గంటలు దాటితే మాడు పగిలిపోతోంది. ఈ పరిస్థితుల్లో ప్రధాన రహదారులపై బస్టాప్‌ల వద్ద షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల బస్టాప్‌లలో ఆటోలు నిలుస్తుండటంతో ప్రయాణికులు రోడ్ల పైనే ఎండలో పడిగాపులు కాయాల్సి వస్తోంది. కాగా ప్రయాణికుల రద్దీ లేని ప్రాంతాల్లో వృథాగా బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం ప్రకటనల కోసమే బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీ ఉన్న చోట అందుబాటులో లేకపోవడం, మరి కొన్ని చోట్ల షెల్టర్లు ఉన్న కూడా కూర్చోవడానికి సౌకర్యాలు లేకపోవడంతో వారు ఎండలోనే రోడ్డుపై నిలబడాల్సి వస్తోంది.

◆ చందానగర్‌లోని గంగారం జాతీయ రహదారిపై ఆర్ఎస్ బ్రదర్ ఎదుట బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎండలో గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో సంవత్సరం క్రితం బస్ షెల్టర్లు కూల్చి వేసిన అధికారులు ఇప్పటి వరకు బస్ షెల్టర్ నిర్మించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంగారం పరిసర ప్రాంతాల కాలనీ వాసులు నగరంలోకి వెళ్లేందుకు ఈ బస్ షెల్టర్ ఉపయోగకరంగా ఉంటుంది. సుమారు 30 కాలనీల ప్రజలు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి కీలకమైన ప్రాంతంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

◆ ఓ వైపు అత్యాధునిక బస్ షెల్టర్లు అభివృద్ధి చేస్తూ ఏసీ బస్ షెల్టర్లను అందుబాటులోకి తీసుకొస్తున్న అధికారులు ఇప్పటికీ ఇక్కడ బస్ షెల్టర్ నిర్మించకపోవడం, కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

◆ గంగారం ప్రాంతాల్లో వాణిజ్య వ్యాపార సముదాయాలు అధికంగా ఉన్నాయి. గతంలో ఇక్కడ ఉన్న బస్ షెల్టర్‌ను వ్యాపార సంస్థలు పార్కింగ్ ఇబ్బందులు తలెత్తుతుండడంతో అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను బస్ బేలలో బస్సులను ఆపకుండా నడి రోడ్డు పై నిలుపుతున్నారు. దీంతో ప్రయానికులు రోడ్డు మధ్య వెళ్లి బస్ ఎక్కాల్సి వస్తోంది.

◆ ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేసి ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా బస్సులను బస్ బేలోనే ఆగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హెచ్‌బీసీకి పాలపిట్ట పార్కు నిర్వహణ బాధ్యత

- పూజలు నిర్వహించి సైకిల్ రైడ్ ఆరంభం
- 300 ఆధునిక సైకిళ్లు సిద్ధం


కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌బీసీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి తదితరులు

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని పాలపిట్ట పార్కు నిర్వహణ బాధ్యతలను హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ శనివారం చేపట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌బీసీ అధ్యక్షుడు డాక్టర్ టి సత్యనారాయణరెడ్డి, టీఎస్ఎఫ్‌డీసీ డైరెక్టర్ స్కైలాబ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, మేనేజర్ శ్రావణ్‌తోపాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఇటీవల అటవీశాఖ నిర్వహించిన టెండర్లలో హెచ్‌బీసీ టెండర్ దక్కించుకోవడంతో పాలపిట్ట పార్కు బాధ్యతలను లాంఛనంగా చేపట్టి ప్రత్యేక పూజలను నిర్వహించింది. గతంలో ఈ పార్కు నిర్వహణ బాధ్యతను సైకుల్ సంస్థ నిర్వహించేది. ఆ తర్వాత అగ్నిప్రమాదం చోటు చేసుకోవడం, అనంతరం అటవీశాఖ నిర్వహించిన టెండర్‌ను హెచ్‌బీసీ దక్కించుకోవడంతో వారికి నిర్వహణ బాధ్యతను అప్పగించారు. ఈ సందర్భంగా హెచ్‌బీసీ అధ్యక్షుడు డాక్టర్ టి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పాలపిట్ట పార్కులో 300 అత్యాధునిక గేర్ సైకిళ్లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. లాంచనంగా సైకిళ్ల రైడ్ చేశారు. ప్రజలు వీటిని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ నివారణతోనే కాలుష్య నియంత్రణ


సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ
- హఫీజ్‌పేట్ డివిజన్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ 2023

హఫీజ్‌పేట్ : ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి కాలుష్యాన్ని నియంత్రించడానికి కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణనగర్‌లో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో భాగంగా సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పర్యావరణానికి పెను ముప్పుగా తయారైన ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలన్నారు. కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరు సైకిల్‌ను వినియోగించాలన్నారు. సైక్లింగ్ వల్ల పర్యావరణ హితంతో పాటు, శారీరక శ్రమ కల్గుతుందన్నారు. ప్రతి మహిళ తమ ఇంట్లోని వ్యర్థాలను తడి,పొడిగా వేరు చేయడం అలవాటు చేసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛ స్వర్వేక్షణ్‌లో సర్కిల్‌ను ముందు వరుసలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడానికి అవగాహన ర్యాలీని నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజ హితం కృషి చేయాలని, ప్రతి కాలని, బస్తీ, కుటుంబాల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్‌ను వాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సామాజిక బాధ్యతతో ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో చందానగర్ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ కార్తీక్, బీఆర్ఎస్ నాయకులు బాబు మోహన్ మల్లేష్, కళ్ళం అంజిరెడ్డి పాఠశాల విద్యార్థులు, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాలా విస్తరణతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం


నాలా విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : నాలా విస్తరణతో ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు నుంచి దీప్తిశ్రీనగర్ నాల వరకు చేపట్టిన విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఎన్‌డీపీ వ్యూహాత్మక నాలా అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.15.88 కోట్లతో 2.4 కిలో మీటర్ల మేర నాలా విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. నాలా విస్తరణతో ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న ముంపు సమస్య తీరుతుందన్నారు. ప్రణాళికాబద్ధంగా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రామకృష్ణనగర్‌లో ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించడం జరిగిందన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడకుండా పనులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉమమహేశ్వరావు, నాగేశ్వరరావు, మోహన్, సురేందర్, ప్రదీప్, ఫణీంద్ర, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి తెలిపారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని 10, 11 వార్డుల్లో శనివారం పర్యటించారు. కాలనీ సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం రోజారాణి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు తమకు సూచించాలని కోరారు. వార్డుల్లో జరుగుతున్న యూజీడీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టడంలో పాటు త్వరగా పనులను పూర్తి చేయించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్ శైలజ, మున్సిపల్ అధికారులు శ్రీకాంత్, సాయికిరణ్‌రెడ్డి, వినోద్, మంగ, లక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన


అన్నమయ్యపురంలో కూచిపూడి నృత్యప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శ్రీ వెంకటేశ్వర శశినికేతన్ గురువు హేమ వనసర్ల శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. పుష్పాంజలి, బాదాం త్రిపుర సుందరి, ముద్దుగారే యశోధ, పలుకే బంగారు మాయెరా, మూషిక వాహన, తాంవ నృత్యకరీ, పాటలకు కిన్నెర, గుర్గా, వర్ష, గాయత్రి, హర్షిత, అనన్య, మానస, సహస్ర కూచిపూడి నాట్యాంశాలను ప్రదర్శించి అలరించారు. అనంతరం నిర్వాహకులు కళాకారులను ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ.6.11 లక్షలు విరాళం


మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాదవ్

గచ్చిబౌలి: కొత్తగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.6.11 లక్షలు విరాళంగా అందజేశారు. విద్యుత్ పెండింగ్ బిల్లులు, ఫ్యాన్లు, బల్బుల ఏర్పాటుకు మోరీటెక్ ఫౌండేషన్, రక్షపు సందీప్ గౌడ్ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మా ఊరి పాఠశాలను మేమే అభివృద్ధి చేసుకుంటామనే లక్ష్యంతో మరి కొందరు దాతలు ముందుకు రావడం అభినందనీయమని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్ పేర్కొన్నారు. బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాతవ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు తన వంతు ఆర్థిక సహాయాన్ని అందించినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, రక్షపు కృష్ణ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం ఇన్‌చార్జి డీఈఓ విజయ పరిశీలించారు. అలాగే భెల్ టౌన్‌షిప్‌లోని జ్యోతి విద్యాలయ, సెంటాన్స్ పాఠశాలలను సందర్శించారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. పరీక్ష రాయడానికి వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జెమినీకుమారి, ఉపాధ్యాయులు దామోదర్, తదితరులు ఉన్నారు.



పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలి

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్


బీజేపీలో చేరిన యువకులతో రవికుమార్‌యాదవ్ తదితరులు

రాయదుర్గం: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గం ప్రాంతానికి చెందిన పలువురు యువకులు, కాలనీవాసులు శనివారం బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌పార్టీ తొమ్మిదేళ్లుగా ప్రజలను మాయ మాటలతో మభ్య పెడుతూ మోసం చేస్తూనే ఉందన్నారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి, మోడ్రన్ స్కూల్స్, కేజీ టూ పీజీ ఉచిత విద్య, దళితులకు మూడు ఎకరాల భూమి, బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు, 25వేల కోట్లు, ఎస్టీలకు ట్రిబల్ యూనివర్సిటీ, గిరిజన బంధు, టెక్స్‌టైల్ జోన్ తదితర పథకాల పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. ఎమ్మెల్యే గాంధీ నియోజకవర్గాన్ని అవినీతికి, భూకబ్జాలకు అక్రమాలకు, వసూళ్లకు అడ్డాగా మార్చారన్నారు. కాలనీలలో సమస్యలు పరిష్కరించడం లేదని, మౌలిక వసతుల కల్పనలో విఫలమయ్యారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అన్ని ప్రాంతాల అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. సామ్రాట్‌గౌడ్ ఆధ్వర్యంలో నరేందర్‌చారి, రాజేష్‌గౌడ్, శివముదిరాజ్, శరత్, శివారెడ్డి, సర్దార్, రాజేష్ యాదవ్, వారి అనుచరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, శ్రీనివాస్‌చారి, నరేందర్‌గౌడ్, జితేందర్, కృష్ణాయాదవ్, శ్యామ్‌యాదవ్, సాయి, అమర్‌యాదవ్, కరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి విద్యుత్‌నగర్ కాలనీకి చెందిన పలువురు యువకులు శనివారం బీజేపీలో చేరినట్లు బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శి గడిల శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో వీరంతా పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ జయశ్రీ, తెల్లాపూర్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు కోటి శంకర్, పార్టీలో చేరిన వారిలో సురేందర్, విజయ్, వంశీ, దేవేందర్ కుమార్ ఉన్నారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

పటాన్‌చెరు టౌన్: ఇంటిపై రాళ్లతో దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేశారు. శనివారం రాఘవేంద్ర కాలనీ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు బాధితురాలు పట్లోళ్ల సరిత ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ప్రసాద్‌రావుకు ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద విలేకర్లతో మాట్లాడారు. కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ వర్గీయులు తమ ఇంటిపై రాళ్లతో దాడి చేయడంతో కిటికీల అద్దాలు పగిలాయిన, పిల్లలు తీవ్ర భయాందోళనకు గురవగా, తన అత్త ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఇంటి మహిళలకే ఈ పరిస్థితి ఉంటే, పటాన్‌చెరులో సామాన్య మహిళలకు రక్షణ ఉంటుందా అని ప్రశ్నించారు. పోలీసులు స్పందించి బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరారు.

భరతనాట్య ప్రదర్శన


శిల్పారామంలో అలరించిన భరత నాట్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఆర్‌కెస్ కళానిలయం గురువు సుందరి రవిచంద్ర శిష్యబృందం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. పుష్పాంజలి, శ్రీవిఘ్నరాజం భజయే, పంచముఖి కౌతం, స్వరజతి, శ్లోకాస్, తందనానా, శివపంచాక్షరీ, దశావతారం, వర్ణం, కాళింగనర్తన, తిల్లాన అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కళాకారులు కావ్య, నివేదిత, కిరణ్మయి, శివాని, ప్రవళిక, వైష్ణవి, మాళవిక, ఉషశ్రీ, హరిణి, మోక్ష, హాసిని పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రామాయణ కల్పవృక్షం ఫెస్టివల్


సీసీఆర్టీలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ ట్రైనింగ్) లో మూడు రోజుల పాటు కొనసాగనున్న రామాయణ కల్పవృక్షం ఫెస్టివల్ ఆకట్టుకుంటోంది. ఇందులో భాగంగా శనివారం కళాకారుడు మనస్‌పాత్, పండిత్ దిల్‌కశ్ భారతి సదానంద్ సంప్రదాయ పాటలతో పాటు సుందరాకాండం, రామచరితలోని పలు అంశాలను ఆలపించారు. అమిగనత్ర వాల్మీకి రామాయణం, హేమంత్‌పాండే తులసీరామాయణంలోని హనుమాన్ దర్శన్, సుధాశేషయ్యన్ కంభ రామాయణం, నాగరాజ్ పతూరి రామాయణ అంశాలను ప్రదర్శించి అలరించారు. హేమాకన్నన్ డ్రాయింగ్, రాహుల్ టెడ్డి మాలగ్రాతన, సంస్కృతి సంగీతన సాంప్రదాయ బ్యాండ్‌ను ప్రదర్శించారు. దాతు గ్రూప్ రామాయణ సప్తస్వర తోలు బొమ్మలాటను ప్రదర్శించారు. భావయామి రఘురామమ్ భరతనాట్య ప్రదర్శన చేశారు. విశాఖహరి నవరస రామాయణం హరికథతో ఆకట్టుకున్నారు.